క్లుప్తంగా

హామీలను అమలు చేయాలని వినతి


తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్‌లు

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు బీఎస్ ముదిరాజ్, వెలుగు వెంకన్న, బీసు కృష్ణ, పులుగుజ్జ సుధాకర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామును తొలగించాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

తుంగతుర్తి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఉన్న గడ్డివామును తొలగించాలని జాంబవంత యూత్ క్లబ్ అధ్యక్షుడు కాసర్ల వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాసర్ల సోమయ్య, రాములు, రవి, రాకేష్, సైదులు, శ్రీను, చంద్రయ్య, కృష్ణయ్య, వీరయ్య, కృష్ణ, రాంబాబు, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


మాధవికి బీమా చెక్కు అందజేస్తున్న ఏజీఎం అట్లా సురేష్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన ఐతగాని సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీదారుడిగా ఉండడంతో నామిని అయిన భార్య మాధవికి రూ.7,82,643లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం అట్లా సురేష్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్‌లపై అవగాహన పెంచుకోవాలని, అది భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీఎం చిరంజీవి, బీఎం భరత్ కుమార్, ఎస్‌ఎం నరసింహారావు, డీఓ పాను గోటి వీరాంజనేయులు, శేఖర్, కొండమీది గోవిందరావు, నలబోలు గోపిరెడ్డి, వరకాల లచ్చయ్య, సింగం నాగలింగం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలలను తెరిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నూతనకల్ : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మూతబడిన పాఠశాలలను తెరిపించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూతబడిన 80పాఠశాలల్లో ఏ ఒక్క పాఠశాలకు ప్రభుత్వం ఉపాధ్యాయులను కేటాయించలేదన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించి ప్రతి పాఠశాలకు సర్వీస్ పర్సన్‌ను నియమించడంతో పాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన కోరారు. సమావేశంలో డీటీఎఫ్ నాయకులు జె.అబ్రహం, నర్సింహాచారి, యాదగిరిరెడ్డి, వెంకన్న, సైదులు, సిద్ధిక్ పాషా, ప్రేమేందర్, సైదులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మద్దిరాల : భూతగదాలతో దాడి చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడ్డుల గౌరయ్య, గాడ్డుల రమేష్‌కు మధ్య భూవివాదం సాగుతుంది. ఈ నేపథ్యంలో వారు గొడవపడగా గౌరయ్య రమేష్‌ను పారతో తలపై కొట్టడంతో రమేష్ తలకు తీవ్రంగా గాయమైంది. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రమేష్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు.

వంట..తంటా!

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకు కట్టెల పొయ్యే దిక్కు
- అటకెక్కిన గ్యాస్‌స్టవ్‌ల సరఫరా
- అందని సబ్సిడీ సిలిండర్లు
- వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు


అనంతారం పాఠశాలలో కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటకు సరైన వసతులు లేక ఏజెన్సీ నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న కూరగాయాల ధరలతో పాటు సకాలంలో బిల్లులు అందక ఒక వైపు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు పాఠశాలల్లో వంట గదులు లేక ఆరు బయట కట్టెల పొయ్యిపైనే వంటలు చేయాలంటే పొగ నేరుగా కళ్లలోకి వెళ్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఆరు బయట మరికొన్ని చోట్ల ఇళ్లలోనే వండి తేవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించినప్పటి నుంచి ప్రభుత్వం గ్యాస్ ఇస్తామని చెబుతున్నా నేటికీ అమలుకు నోచుకోలేదు. వసతితో కూడిన విద్యాలయాలు, హాస్టళ్లలో గ్యాస్ పొయ్యిపై వంట చేస్తుండగా.. సర్కారు బడుల్లో కట్టెల పొయ్యే దిక్కవుతోంది.

అందని సబ్సిడీ సిలిండర్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు కట్టెల పొయ్యిపై అష్టకష్టాలు పడుతూ వంట చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో వంట చేసేందుకు సబ్సిడీ సిలిండర్లు అందించడం లేదు. ఏళ్లు గడిచినా వాటి ఊసే ఎత్తడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు కట్టెల పొయ్యి మీదే వంటలు చేయాల్సి వస్తోంది. అసలే వర్షాకాలం కట్టెలు దొరక్క, అవి మండక పొయ్యి ద్వారా వచ్చే పొగతో నిర్వాహకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చెట్లకింద, వరండాల్లో వంటలు..

మండలంలోని 40ప్రాథమిక, 4ప్రాథమికోన్నత, 8ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అనేక పాఠశాలల్లో వంట గదులు నిర్మించినప్పటికీ అవి విశాలంగా వంట చేసేందుకు వీలుగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో చెట్లకింద, వరండాల్లో వంటలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సిలిండర్లు లేకపోవడంతో కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో తరగతి గదుల గోడలు మసిబారుతున్నాయి. ఉపాధ్యాయులు తరగతి గదుల తలుపులు మూసీ పాఠాలు బోధించాల్సి వస్తుంది. పొగ కారణంగా తాము రోగాల బారిన పడే ప్రమాదం ఉందని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కట్టెల కొరత తీవ్రంగా ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు. సబ్సిడీపై సిలిండర్లు అందిస్తే తమకు ఈ కష్టాలు ఉండవని వాపోతున్నారు.

గ్యాస్ సిలిండర్లు అందించాలి

మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందించాలి. కట్టెల పొయ్యిపై వంట చేయాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆరుబయట వంట చేస్తున్నాం. గాలికి పోయ్యి మండక అష్టకష్టాలు పడుతున్నాం.

– షేక్ అమ్మాని,మధ్యాహ్న భోజన కార్మికురాలు, అనంతారం

కేవీకే శాస్త్రవేత్తల పంటల పరిశీలన


పత్తిపంటపై రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి, అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేస్తున్న పత్తి, పెసర పంటలను గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు బుధవారం సందర్శించి రైతులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భనలో భాగంగా కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ మాట్లాడారు. డ్రమ్‌సీడర్ పద్ధతిలో నార్లుపెంచి నాటు వేసే అవసరం లేదన్నారు. దీంతో నాటుకు అవసరమైన కూలీల ఖర్చును ఆదా చేయవచ్చన్నారు. నాటు వేసిన వరి కంటే డ్రమ్‌సీడర్‌తో వేసిన వరి 5–7రోజులు ముందుగా కోతకు వస్తుందన్నారు. అదే విధంగా ప్రస్తుతం పత్తి పంట 35–45రోజుల దశలో ఉందని గత మూడు రోజులుగా వర్షాలు కురవడం, నేలలో తగిన తేమ ఉండడంతో ప్రస్తుతం ఎరువులను వేసుకోవడం అనుకూలమన్నారు. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ కనిపించిన వెంటనే వేపనూనె 5మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 20చొప్పున అమర్చుకోవాలని కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ తెలిపారు. అలాగే అధిక వర్షాలు కురవడం వలన పత్తిపంటలో వేరుకుళ్లు, మొదళ్ల కుళ్లు రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు వర్షపు నీటిని బయటకు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సంతోష్, రైతులు ఎస్‌కె.సయ్యద్, బంటు హుస్సేన్, సాగర్, రైతులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి : మండలంలోని కేఆర్‌తండా వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 20క్వింటాల రేషన్ బియ్యాన్ని బుధవారం మండల పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న మడోత్ మాన్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా అమ్మినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్, విభాగాధిపతులు, బోధన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆస్పత్రిలోని అన్ని విభాగాల సిబ్బంది వివరాలు, ఓపీ, ఐపీ సేవలు, మెడికల్ స్టోర్ వివరాలు, శానిటేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నమ్మకంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే వారికి రోగ నిర్ధారణ పరీక్షలు చేసిన పిదప మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చి ఓపీ సేవలు పెంచాలని, ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌భట్, నోడల్ అధికారి డాక్టర్ నరసింహ, రెసిడెన్సియల్ మెడికల్ అధికారి డాక్టర్ జనార్దన్, విభాగాధిపతులు, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


సూర్యాపేట పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : వర్షాకాలం కావడంతో సూర్యాపేట పట్టణంలో పారిశుధ్య సమస్యలు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణంలోని 48వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వారంలో మూడు రోజులు తప్పకుండా వార్డుల్లో పర్యటిస్తానన్నారు. సూర్యాపేట పట్టణంలో నిన్నటి వరకు ఇంటికే పరిమితమైన మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ తాను చేపట్టిన మార్నింగ్‌వాక్ చూసి ఆమె వార్డుల్లో పర్యటించడం సంతోషదాయకమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూడా హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఐసీసీ మెంబర్ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పార్టీ నాయకులు కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, స్థానిక కౌన్సిలర్ వెలుగు వెంకన్న, నాయకులు తదితరులు ఉన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్తంగా ఈనెల 26నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సూర్యాపేటలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుణగంటి సురేష్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫొటో చిత్రీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటిని అధ్యయనం చేసేందుకు ఫొటో ఎక్స్‌పో కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని ఫొటోగ్రాఫర్లందరూ ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లాలు, రాష్ట్ర కోశాధికారి అటిపాముల మల్లికార్జున్, తోడి శ్రీనివాసరావు, పట్టణ కోశాధికారి నజీరు, శ్రీకాంత్, శేఖర్, మల్లేష్, దుర్గారావు, వరుణ్, శంకర్, మధు, రాజు, సాయిరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి


మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని, అందుకు రాష్ట్రం నుంచి బీజేపీ ఎంపీలుగా గెలిచిన వారితో పాటు కేంద్ర మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రధానిమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొదటి నుంచి తెలంగాణపై ప్రధాని మోదీకి వివక్ష ఉందని, ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దీనికి అర్థం పడుతుందన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కార్మికుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నరసయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఉపాధ్యక్షురాలు రేణుక, జయమ్మ, సయ్యద్, పిడమర్తి లింగన్న, గోగుల వీరబాబు, విజయ్‌రెడ్డి, గణేష్, పద్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి


సూర్యాపేట రూరల్ : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ దినకర్


ఆత్మకూర్(ఎస్) : రైతు బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు


చివ్వెంలలో..

సూర్యాపేట రూరల్ : రైతుబీమాకు దరఖాస్తు చేసుకొని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దినకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎండ్లపల్లి, టేకుమట్ల గ్రామాల్లోని రైతువేదికల్లో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. జూన్ 28వరకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు ఇంత వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకొని వారు ఆగస్టు 5నాటికి చేసుకోవాలన్నారు. రైతు బీమా దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు లక్ష్మి, అనూష, స్వాతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు, పట్టా పుస్తకం వచ్చి ఇంతకు ముందు దరఖాస్తు చేసుకోని రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి దంతాల దివ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని నెమ్మికల్లులో ఆమె రైతు బీమా దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. పట్టాదారు పాస్‌పుస్తకము లేదా ధరణిలో డిజిటల్ సంతకం అయ్యి 28జూలై 2024వ తేదీ వరకు వచ్చిన రైతులు, 59సంవత్సరాలలోపు వారు మాత్రమే ఈ రైతు బీమాకు అర్హులని, వారు దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, రైతు పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌తో నేరుగా వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చివ్వెంల : కొత్తగా పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ.ఆశాకుమారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలోని రైతువేదికలో ఆమె రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18–59 సంవత్సరాల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత రైతులు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్‌లు జతపరిచి రైతు వేదికల్లో అందజేయాలని సూచించారు. ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్‌కుమార్, రైతులు పందిరి వీరారెడ్డి, సత్తూరి సోమేష్, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు


మద్దిరాల : బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ రామారావును సన్మానిస్తున్న తహసీల్దార్


తిరుమలగిరిలో ఆర్ఐని సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

మద్దిరాల : ఉత్తమ ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ రామారావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వహీద్, సిబ్బంది, మల్సూర్, ఉప్పలయ్య, డీలర్లు తీగల వెంకన్న, వెంకటేశ్వర్‌రావు, తాళ్లపెల్లి మల్లేష్, శేఖర్, బీఎల్ఓలు గుర్వోజు రమాదేవి, సహేదా, హైమావతి, చలం, అశోక్ ఉన్నారు.

తుంగతుర్తి : సమాజంలో కష్టపడి పనిచేసిన వారికి ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు లభిస్తుందని పాఠశాల హెచ్‌ఎం పాటి సుధీర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న పరమేష్‌ను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమల్లు, ఫర్వీనా, నాగేశ్వరీ, హర్షవర్ధిని, లక్ష్మీబాయి, శారద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఆర్ఐ ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ కపిల్, ఆఫీస్ సబార్డినేటర్ అయిలమ్మ, యాకూబీ బదిలీ అయ్యారు. బుధవారం వారికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధ మాట్లాడారు. పనిచేసిన ప్రతి చోట ప్రజలల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, సర్వేయర్ జోసఫ్, సుజిత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మండల పరిధిలోని తొండ గ్రామ ఎస్సీకాలనీలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కె.అశోక్‌రెడ్డి, ఎం.అనితాకుమారి, ఆర్.మల్లిఖార్జున్‌గౌడ్‌లు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం మురళీ, చైర్మన్ మంజుల, పూర్వ విద్యార్థులు వినోద్‌రావు, సోమనారాయణ, పుల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


తుంగతుర్తి : కొత్తగూడెంలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు


తిరుమలగిరి (తుంగతుర్తి) : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

బీజేపీ గెలుపులో ఎమ్మార్పీఎస్ ముఖ్యపాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

భానుపురి (సూర్యాపేట) : రిజర్వేషన్ పోరాటానికి అండగా ఉంటామని తెలపడంతో బీజేపీని గెలిపించడంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య పాత్ర పోషించిందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్య మాదిగ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30సంవత్సరాల సామాజిక న్యాయ పోరాటమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని చూసి ప్రధాని నరేంద్రమోదీ విశ్వరూప మహాసభలో భావోద్వేగానికి గురయ్యారని తెలిపారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ లక్ష్యం నెరవేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ కమిటీలను పూర్తి చేసి జెండాలను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, నాయకులు కందుకూరి సోమన్న, బొజ్జ సైదులు, కొత్తపెల్లి ఆంజనేయులు, పుట్టల మల్లేష్, శ్రీనివాస్, దైద శ్రీను, నవీన్, వెంకన్న, మేడి కృష్ణ, తాటిపాముల నవీన్, రాజు, మామిడి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులను వెంటనే ప్రారంభించాలి

తుంగతుర్తి : మండల కేంద్రంలో నిలిచిన 100పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ శంకుస్థాపన చేశారని, ఆ పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారని అన్నారు. కాని పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, అధికారులు స్పందించి నిధుల విడుదల చేసి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఉన్న ఆస్పత్రిని సగభాగం కూల్చివేయడంతో ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా అందడం లేదన్నారు. సమావేశంలో నాగరాజు, నరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అనసూయ

తుంగతుర్తి : ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న మన చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారి (జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి) డీబీసీడీఓ అనసూయ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆమె వెంట పాఠశాల సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌కే దక్కింది

ఆత్మకూర్(ఎస్) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి అన్నారు.రైతులకు తొలివిడతగా లక్ష రూపాయలు వరకు రుణమాఫీ చేసి రైతులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకున్నారని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు నెలాఖరులోగా రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లలో సబ్సిడీ కల్పించి వ్యవసాయం చేసే ప్రతి రైతును ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బొక్క హరీష్, కొత్త శ్రీనివాస్, రాకేష్, మహేష్ ఉన్నారు.